ప్రజాశక్తి
మంగళవారం 29 ఆగస్టు 2023

30న విఆర్ఎల నిరసన

ప్రజాశక్తి - కురుపాం

కలెక్టరేట్ ఎదుట ఈ నెల 30న విఆర్ఎలు చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు కోరారు. సోమవారం కురుపాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 25న విఆర్ఎల హక్కుల సాధన కోసం శాంతియుతంగా ధర్నా నిర్వహించడానికి విజయవాడ వెళ్లిన విఆర్ఎలను అక్రమంగా అరెస్టు చేసి, నిర్బంధించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దిక్కూ మొక్కూ లేని మున్సిపాలిటీ

- ఎసిబి దాడిలో కమిషనర్ సస్పెన్షన్
- ఇప్పటికే డిఇ ఇన్‌ఛార్జిగా ఉన్న ఎఇ
- ఒత్తిడి తట్టుకోలేక సెలవులోకి ఇన్‌ఛార్జి కమిషనర్
- డిప్యూటీ సిఎం ఇలాకాలో పురపాలన దుస్థితి

ప్రజాశక్తి-సాలూరు

సాలూరు మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత చరిత్రలో ఎన్నడూ చూడని పరిస్థితి ఇప్పుడు కనిపిస్తోంది. కమిషనర్ హెచ్.శంకరరావు ఎసిబి వలలో చిక్కి సస్పెండై 18 రోజులైంది. ఇంతవరకు కొత్త కమిషనర్‌ని మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయం నియమించలేదు. మున్సిపల్ ఎఇ ఎల్.సూరినాయుడును ఇన్‌ఛార్జి కమిషనర్‌గా నియమిస్తూ మున్సిపల్ డైరెక్టరేట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టి వారం రోజులు కాకముందే సెలవులోకి వెళ్ళిపోయారు. అటు ఇన్‌ఛార్జి డిఇగా, ఇటు ఇన్‌ఛార్జి కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించేందుకు భయపడి ఎఇ సూరినాయుడు సెలవు పెట్టినట్లు తెలుస్తోంది. గతంలో మున్సిపల్ డిఇ ఉన్నప్పుడు ఆయనే ఇన్‌ఛార్జి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టేవారు. డిఇ పోస్ట్ గత కొన్ని సంవత్సరాలుగా ఖాళీగా ఉంది. ఎఇ సూరినాయుడు డిఇ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కమిషనర్ బాధ్యతలు కూడా అప్పగించడంతో ఆయన బెంబేలెత్తి సెలవు పెట్టినట్లు సమాచారం. అసలే ఎసిబి దాడులు జరగడంతో మిగిలిన విభాగాల అధికారులు బిక్కుబిక్కుమంటూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒకే అధికారి మూడు కీలక విభాగాల బాధ్యతలు నిర్వహించడమంటే కత్తిమీద సాము లాంటిదే.

పట్టణంలో కొన్ని కీలకమైన పనులకు సంబంధించి ఒత్తిడులు పెరుగుతున్న కారణంగా ఇంఛార్జి కమిషనర్ బాధ్యతలు నిర్వహించడానికి ఎఇ సూరినాయుడు భయపడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎఇ సూరినాయుడు సెలవు పెట్టడంతో మేనేజర్ రాఘవాచార్యులుకు డెలిగేషన్ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. ఆయన కూడా కమిషనర్ బాధ్యతలు నిర్వహించడానికి భయపడుతున్నారు.

రెండు వారాలుగా పురపాలన పూర్తిగా గాడి తప్పింది. చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ భర్త తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో ఆమె కార్యాలయానికి వచ్చే పరిస్థితి లేదు. కొద్దిరోజుల క్రితం చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ.. కాంట్రాక్టర్లు, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. భర్త అనారోగ్యం కారణంగా తాను తరచూ కార్యాలయానికి రాలేనని నిస్సహాయత వ్యక్తం చేశారు. తన తర్వాత ఉన్న వైస్ చైర్మన్లే పర్యవేక్షణ చేస్తారని చెప్పారు.

సమన్వయం లేని వైస్ చైర్మన్లు

మున్సిపల్ వైస్‌చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు పట్టణంలో వైసిపిలో చెరో గ్రూపునకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పట్టణ పార్టీలో గ్రూపు రాజకీయాల ప్రభావం పురపాలనపై స్పష్టంగా కనిపిస్తోంది. దీనికి తోడు రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో కీలక నిర్ణయాలు జాప్యం అవుతున్నాయి. వైస్ చైర్మన్ల మధ్య సమన్వయం లేకపోవడంతో అధికారులు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఎవరి మాట వింటే ఎవరికి కోపం వస్తుందోనని భయపడుతున్నారు. నెలనెలా జరిగే మున్సిపల్ సాధారణ సమావేశాలు కూడా గత కొద్దినెలలుగా మొక్కుబడిగా సాగుతున్నాయి. సమావేశాల్లో కౌన్సిలర్లు అడిగే సమస్యలపై జవాబుదారీతనంతో సమాధానం చెప్పే అధికారులు లేరు. చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ భర్త అనారోగ్యంతో ఉన్న కారణంగా ఆమె పురపాలనపై దృష్టిసారించలేదు. దీంతో ఇటీవల సస్పెండైన కమిషనర్ శంకరరావు అన్నీ తానై వ్యవహరించి రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ శాఖలపై ప్రత్యేక దృష్టి సారించారు. పాలకవర్గాలు చేయాల్సిన నిర్ణయాలు, పనులు పూర్వ కమిషనర్ శంకరరావు చేసి అత్యాశకు పోయి ఎసిబి వలలో చిక్కిపోయారు.

కమిషనర్ నియామకంలో జాప్యమెందుకో

మున్సిపల్ కమిషనర్ నియామకంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. 18 రోజులైనా కొత్త కమిషనర్ నియామకంపై స్పష్టత లేదు. మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయంలో ఏ అధికారి పాచికలు పారతాయో వారే ఇక్కడకు కమిషనర్‌గా వచ్చే అవకాశం ఉంది. అయితే డిప్యూటీ సిఎం రాజన్నదొర పాలకొండ నగర పంచాయతీ మేనేజర్ జయరాంకు ఇన్‌ఛార్జి కమిషనర్ బాధ్యతలు అప్పగించాలని కోరుతూ సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా అధికారపార్టీకి చెందిన కీలక నేతలు మరో ఇద్దరు అధికారులకు సిఫార్సు చేసినట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో కమిషనర్ నియామకం జాప్యమవుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి.

అంతర్రాష్ట్ర రహదారిపై బైఠాయించిన వంతెన సాధన కమిటీ సభ్యులు, సిపిఎం, టిడిపి, జనసేన నాయకులు, ప్రజలు

పూర్ణపాడు-లాబేసు వంతెనను పూర్తిచేయాలని వంతెన సాధన కమిటీ ఆధ్వర్యాన సోమవారం కొమరాడ తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంతర్రాష్ట్ర రహదారిపై బైఠాయించారు. వీరి నిరసనకు టిడిపి, సిపిఎం, జనసేన, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకూ దశలవారీగా పోరాటం కొనసాగించాలని నాయకులు ప్రతినబూనారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు సహా తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

(పూర్తి వివరాలు మెయిన్‌లో)

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు కోరాడ ఈశ్వరరావును అరెస్టు చేస్తున్న పోలీసులు

విద్యుత్తు ఉద్యమ స్ఫూర్తితో మరో పోరాటం

విద్యుత్తు అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - బెలగాం

2000లో జరిగిన విద్యుత్తు ఉద్యమ స్ఫూర్తితో ప్రజలు.. పెంచిన ఛార్జీలపై మరో పోరాటానికి సన్నద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.మన్మథరావు పిలుపునిచ్చారు. విద్యుత్తు పోరాట అమరవీరులైన రామకృష్ణ, విష్ణువర్ధనరెడ్డి, బాలస్వామి 23వ వర్ధంతి సందర్భంగా బెలగాంలోని సుందరయ్య భవనంలో వారి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సభలో మన్మథరావు మాట్లాడుతూ నాడు టిడిపి ప్రభుత్వం పెంచిన విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని, ప్రపంచ బ్యాంకు సంస్కరణలకు వ్యతిరేకంగా సుమారు వంద రోజులు అనేక రూపాల్లో పోరాటాలు సాగాయని గుర్తుచేశారు. బషీరాబాగ్ వద్ద జరిగిన పోలీస్ కాల్పుల్లో ముగ్గురు అమరులయ్యారని తెలిపారు. నాటి నుంచి ఏ ప్రభుత్వమూ విద్యుత్తు ఛార్జీలు పెంచేందుకు సాహసం చేయలేదన్నారు. కానీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలను రాష్ట్రంలో వైసిపి సర్కారు అమలు చేస్తూ విద్యుత్తు ఛార్జీలు పెంచిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలపై అదనపు ఛార్జీల భారం మోపిందన్నారు. పెంచిన విద్యుత్తు ఛార్జీలు తగ్గించేవరకూ మరో ఉద్యమం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎన్‌వై నాయుడు, పట్టణ నాయకులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమ, కార్మికులు పాల్గొన్నారు

ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన జెఎసి నాయకులు, గిరిజనులు

మణిపూర్‌లో హింసకు వ్యతిరేకంగా ఐటిడిఎ వద్ద నిరసన

ప్రజాశక్తి-సీతంపేట

మణిపూర్ రాష్ట్రంలో ఇటీవల గిరిజనులపై జరిగిన దాడులను ఖండిస్తూ గిరిజన సంఘాలు, ఆదివాసీ జెఎసి ఆధ్వర్యంలో సోమవారం ఐటిడిఎ వద్ద నిరసన చేపట్టారు. ముందుగా సీతంపేట హైస్కూల్ వద్దకు గిరిజనులు భారీగా తరలివచ్చారు. అక్కడి నుండి ఐటిడిఎ వరకు శాంతియుత ర్యాలీ చేపట్టారు. మణిపూర్‌లోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులపై దాడులు జరుగుతున్నాయని జెఎసి నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. సీతంపేటలో కోర్టు తీర్పు ఇచ్చిన 29 ఎల్‌టిఆర్ కేసులు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీతంపేట ఐదో షెడ్యూల్లో ఎల్‌టిఆర్, 1/70, పీసా చట్టాలు పగడ్బందీగా అమలు చేయాలని కోరారు. గిరిజన ఉపాధ్యాయురాలిని కులం పేరుతో దూషించిన లోకేష్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పిఒ కల్పనకుమారికి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో గిరిజన సంఘాలు, ఆదివాసీ జెఎసి నాయకులు బి.శ్రీనివాసరావు, నిమ్మక కాంతారావు, హెచ్.మోహనరావు, హెచ్.ప్రసాదరావు, బి.ఉమామహేశ్వరరావు, ఎం.రామారావు, రవి, కె.భాస్కరరావు, కె.అజయ్ కుమార్, కె.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ స్పందనకు 49 వినతులు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎలో సోమవారం పిఒ కల్పనకుమారి ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన స్పందనకు 49 వినతులు వచ్చాయి. క్యారసింగికి చెందిన జి.రూప జీవనోపాధి కల్పించాలని కోరారు. బూర్జిమానుగూడకు చెందిన పార్వతి కుట్టు మిషన్ మంజూరు చేయాలని విన్నవించారు. దుగ్గికి చెందిన విజయ పిండి మిల్లు ఇప్పించాలని కోరారు. ఆమరిమానుగూడకు చెందిన గూర్సు రుణం ఇప్పించాలని వినతి అందించారు. చాపరాయిగూడకు చెందిన శంకర్రావు ఇసుక రవాణాకు అనుమతి ఇప్పించాలని కోరారు. పెద్దగూడకు పంచాయతీ భవనం మంజూరు చేయాలని బాపయ్య విన్నవించారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డిడి శ్రీనివాసరావు, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.సింహాచలం, డిప్యూటీ డిఎంహెచ్ఒ చిరంజీవి, డిప్యూటీ డిఇఒ లిల్లీ రాణి, పిఎఒ హరికృష్ణ, పిహెచ్ఒ గణేష్, ఎటిడబ్ల్యుఒ మంగవేణి, సిడిపిఒ పి.రంగలక్ష్మి, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి ఎన్.జాక్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పన, అధికారులు

ఫీడర్ అంబులెన్స్ ఉద్యోగుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి - బెలగాం

ఫీడర్ అంబులెన్స్ ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలని సోమవారం సిఐటియు ఆధ్వర్యాన ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్‌కి వినతి అందించారు. రహదారులు లేని గిరిజన ప్రాంతాలలో గర్భిణులకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆరేళ్లుగా సేవలందిస్తున్న ఫీడర్ అంబులెన్స్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఫీడర్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు ఎన్‌వై నాయుడు, కార్యదర్శి రాజమండ్రి రాము కోరారు. కనీస వేతనం ఇవ్వాలని, ఐటిడిఎల పరిధిలో చేపడుతున్న నియామకాలలో ఫీడర్ ఉద్యోగులకు సర్వీస్ ప్రాతిపదికన అవకాశం కల్పించాలని కోరారు. ఉద్యోగులకు ప్రస్తుతం రోజుకు మూడు కేసులు తెచ్చి ఆన్‌లైన్ చేస్తేనే జీతం ఇస్తున్నారని, ఈ నిబంధనను సడలించాలని విజ్ఞప్తిచేశారు. కొత్త వాహనాలు వచ్చే వరకు ఈ నిబంధనను నిలిపివేసి, ఇప్పటివరకు నిలిపి వేసిన మొత్తాన్ని ఉద్యోగులకు జమ చేయాలని కోరారు. వాహనాల మరమ్మతులకు పెడుతున్న ఖర్చులు పూర్తిస్థాయిలో విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, జిల్లా కోశాధికారి సన్యాసిరావు, పట్టణ కార్యదర్శి సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు సన్యాసిరావు, ఉమామహేశ్వరరావు, ఫీడర్ ఉద్యోగుల సంఘం నాయకులు ఈశ్వరరావు, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు శాఖ కార్యాలయంలో వేచిచూస్తున్న ఎసిబి అధికారులు

దొరకని ఎఇ

వేచిచూసి వెనుదిరిగిన ఎసిబి అధికారులు

ప్రజాశక్తి-మక్కువ

లంచం తీసుకుని ఎసిబి అధికారులకు ఆదివారం రాత్రి చిక్కకుండా తప్పించుకున్న ఎఇ శాంతారావు ఆచూకీ సోమవారం సాయంత్రం వరకూ తెలియలేదు. స్థానిక విద్యుత్తు శాఖ కార్యాలయంలో ఎసిబి డిఎస్‌పి రామచంద్రరావు, సిఐ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది... ఎఇ కోసం వేచి చూశారు. వారికి అందిన సమాచారం మేరకు సిబ్బంది కోన శాంతిశ్వరం ఆలయం వద్ద వెతికారు. మండల కేంద్రం మక్కువలో కూడా అణువణువూ వెతకసాగారు. దీంతో ఎసిబి అధికారులు చేసేది ఏమీ లేక వెనుతిరిగారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎసిబి డిఎస్‌పి కూడా ఉన్నారు.

ప్రధాన రహదారికి మోక్షం కలిగించండి

పార్వతీపురం టౌన్ : పట్టణ ప్రధాన రహదారికి మోక్షం కలిగించాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. సోమవారం జనసేన నాయకులు వంగల దాలినాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్ తదితరులు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావును కలిసి సమస్యను వివరించారు. ఏ మాత్రం చినుకులు పడినా చెరువుగా మారుతున్న పట్టణ ప్రధాన రహదారి సమస్యపై చర్చించారు. మురుగు కాలువల్లో షిల్ట్ తొలగించకపోవడమే అందుకు కారణమని వివరించారు. జెసి వెంటనే స్పందించి మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడుకు చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశించారు..

కూలిన పాఠశాల ప్రహరీ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని ఎంఆర్ నగరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న ప్రహరీ గోడ కొంతమేర కూలిపోయింది. పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం మంజూరైన అదనపు గదుల నిర్మాణం చేపడుతున్నారు. గదుల నిర్మాణానికి పునాదుల కోసం తీసిన మట్టిని ప్రహరీకి ఆనుకొని వేశారు. గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మట్టి నానిపోవడం వల్ల ప్రహరీపై ఒత్తిడి పెరిగి కొద్దిగా కూలిపోయింది. పడిపోయిన గోడను తిరిగి నిర్మిస్తామని తల్లిదండ్రుల కమిటీ సభ్యులు తెలియజేశారు.

కూలిపోయిన ప్రహరీ

కురుపాం.. నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పిఒ విష్ణుచరణ్

భవన నిర్మాణాలు పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో మొండెంఖల్ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అదనపు భవన నిర్మాణ పనులను ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ సోమవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు పనుల్లో ఎక్కడా నాణ్యత లోపాలు లేకుండా త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారి జె.శాంతీశ్వరరావు, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని టిక్కబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను పార్వతీపురం ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వార్డెన్ అప్పారావును అడిగి తెలుసుకున్నారు.

ఇసుక మాఫియాకు ప్రభుత్వ ప్రోత్సాహం

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి

ప్రజాశక్తి-పాచిపెంట

నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్రంలో ఇసుక మాఫియాను వైసిపి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి ఆరోపించారు. సోమవారం మండలంలో పాంచాలి గ్రామంలో వట్టిగడ్డ ఇసుక రీచ్ వద్ద టిడిపి నాయకులు సత్యాగ్రహ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి హయాంలో ప్రజలకు ఉచితంగా ఇసుక అందుబాటులో ఉండేదన్నారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వంలో దాచుకోవడం, దోచుకోవడం అలవాటైందన్నారు. ఇసుక మాఫియా అక్రమాలకు అడ్డుకట్ట వేసి, భూగర్భ జలాలను పరిరక్షించుకోవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.పి భంజ్‌దేవ్, మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు, వేణు, నిమ్మాది చిట్టి, సర్పంచ్ గూడెపు యుగంధర్, ముఖి సూర్యనారాయణ పాల్గొన్నారు.

పాచిపెంట.. వట్టిగడ్డ ఇసుక రీచ్ వద్ద సత్యాగ్రహ నిరసన చేపడుతున్న టిడిపి నాయకులు

సీతానగరం.. నిరసన ప్రదర్శన చేపడుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

సీతానగరం : ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ద్వారపురెడ్డి జగదీష్ అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం సీతానగరంలో టిడిపి ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఇసుక దందా చేసి కాంట్రాక్టర్లను పెంచి పోషిస్తోందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక ఉచితమనే పదం లేకుండా పోయిందన్నారు. సామాన్యుడు ఇల్లు నిర్మించుకోవాలంటే ఇసుక దొరికే పరిస్థితి లేదని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవులు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.విజయచంద్ర, మండల అధ్యక్ష, కార్యదర్శులు కొల్లు తిరుపతిరావు, వేణుగోపాల్ నాయుడు, మండల నాయకులు బి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, ఎస్.కొండలరావు, హరి, గోపాలరావు, సర్పంచ్ జె.తెరీజమ్మ, తదితరులు పాల్గొన్నారు

ప్రజాశక్తి
www.prajasakti.com

బ్రెయిన్ కేన్సర్‌తో గిరిజన విద్యార్థి మృతి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రేగిడి గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న హిమరిక ప్రమీల బ్రెయిన్ కేన్సర్‌తో మృతి చెందింది. విద్యార్థిని ప్రమీలను వైద్యం కోసం 15 రోజుల కిందట విశాఖ కెజిహెచ్‌కు తరలించి వైద్యసేవలు అందించారు. వ్యాధి ముదరడంతో చికిత్స పొందుతూ మరణించినట్లు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు తెలిపారు. విద్యార్థిని స్వగ్రామం కొమరాడ మండలం గాజులగూడ. విద్యార్థిని మరణవార్త తెలుసుకున్న పాఠశాల హెచ్ఎం సుగుణకుమారి, వార్డెన్ జోగిలత, ఉపాధ్యాయులు గ్రామానికి వెళ్లి విద్యార్థిని తల్లిదండ్రులను ఓదార్చారు.

మృతిచెందిన ప్రమీల(ఫైల్)

సమరభేరి పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో నీలకంఠాపురంలో సోమవారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు సమరభేరి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగాయని చెప్పారు. దీనికి కారణం మోడీ విధానాలని తెలిపారు. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరిస్తున్నారని, మతోన్మాదాన్ని రెచ్చగొట్టి విద్వేషాలను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. దీనిపై సిపిఎం సమరభేరి చేపడుతోందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.శ్రీనివాసరావు, పి.వాసు, బిడ్డిక భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వేపై అప్రమత్తం

ప్రజాశక్తి-సీతంపేట

ఓటర్ల సర్వే జరుగుతున్న నేపథ్యంలో బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని టిడిపి పాలకొండ నియోజకవర్గ నాయకురాలు పడాల భూదేవి.. ఆ పార్టీ శ్రేణులకు సూచించారు. క్యాంపు కార్యాలయంలో టిడిపి నాయకులతో సోమవారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ కేడర్‌కు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల సర్వేపై దృష్టి సారించి అర్హులైన వారిని తొలగించకుండా చూడాలని కోరారు. డూప్లికేట్ ఓటర్లు నమోదు కాకుండా చూడాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను ఓటర్లుగా చేర్పించాలని తెలిపారు.

మాతృభాష గొప్పతనం వర్ణించలేనిది

ప్రజాశక్తి-సాలూరు

మాతృభాష తెలుగు గొప్పతనం వర్ణించలేనిదని శ్రీవెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం మాతృభాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలుగు భాషలో ఉండే మాధుర్యం మరే భాషలోనూ లేదన్నారు. మాతృభాషలో ప్రాథమిక విద్య అభ్యసించిన వారు ఎందరో ఉన్నత శిఖరాలను అధిరోహించారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బలిజిపేట.. పంట నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

ఇ-పంట నమోదు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని కాశీపేట, అంటిపేట గ్రామాల్లో సోమవారం ఇ-పంట నమోదు చేపట్టారు. ఈ ప్రక్రియను వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా 44 రెవెన్యూ గ్రామాలలో 3350 ఎకరాల్లో ఇ-పంట నమోదు చేసినట్లు తెలిపారు. వరి 2200 ఎకరాలలో ఇ-పంట నమోదు చేసినట్లు చెప్పారు. సాధారణ విస్తీర్ణం 15,500 ఎకరాల్లో పంట నమోదు కావాలన్నారు.

బలిజిపేట : మండలంలోని మిర్తివలస, బర్లి గ్రామాల్లో ఇ-క్రాప్ నమోదును సోమవారం ఎఒ శ్రావణ్ పరిశీలించారు. సెప్టెంబర్ 15లోగా ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలని రైతులకు ఆయన సూచించారు.

పండ్ల మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మండలంలో గంగన్నదొరవలస, ముంగివానివలస, మెట్టవలస, రేగాపువలస గ్రామాల్లో ధరణి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా గిరిజనులకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. గాజులరేగ చిరుధాన్యాల పరిశోధన, రస్తాకుటుంబాయి కృషి విజ్ఞాన కేంద్రాలు సంయుక్తంగా అందజేశాయి. అనంతరం చిరుధాన్యాల సాగుపై వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీనుబాబు, రస్తాకుంటుబాయి కెవికె అధినేత పాత్రో వివరించారు. కార్యక్రమంలో మరిపల్లి సర్పంచ్ తొత్తడి నారాయణమ్మ, ధరణి శాంతి, ఐఎఫ్ఎస్ఎం ఇఒ ఎం.నాగేశ్వర రావు, రైతులు పాల్గొన్నారు.

42 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని అడ్డూరివలస గ్రామంలో 42 మందికి వైద్యసేవలు అందించినట్లు వైద్యాధికారి అనూష తెలిపారు. సోమవారం ఆ గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.

31న సంఘీభావ పాదయాత్ర

ప్రజాశక్తి-కొత్తవలస

నారా లోకేష్ యువగళం పాదయాత్ర 200 రోజులకు చేరుకుంటున్న నేపథ్యంలో ఈ నెల 31న సంఘీభావ పాదయాత్ర చేయనున్నట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ తెలిపారు. కొత్తవలసలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ కొత్తవలస మండలం దేశపాత్రునిపాలెం నుండి కొత్తవలస ఎన్టీఆర్ విగ్రహం వరకు ఆ రోజు ఉదయం 9గంటలకు సంఘీభావ పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. ఈ పాదయాత్రలో నియోజకవర్గ పరిధిలో గల టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయం

ప్రజాశక్తి-తెర్లాం

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. మండలంలోని ఎంఆర్ అగ్రహారం సచివాలయ పరిధిలో రంగప్ప వలస, తమ్మి వలస గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మొదటిగా రంగవలస గ్రామ సర్పంచ్ ఎస్ రాంబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తన సోదరుడు వేణుగోపాలనాయుడుతో కలిసి గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమల తీరును అడిగి తెలుసుకున్నారు. మరోసారి ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్ రామకృష్ణ, ఎంఇఒ త్రినాధ రావు, వివిధ శాఖల అధికారులు, నాయకులు బాబ్జి రావు, రామారావు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు రైతుల చెంతకు చేరాలి

వేపాడ: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను రైతుల చెంతకు చేరే విధంగా సిబ్బంది కృషి చేయాలని ఎస్‌కోట ఏరియా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ బి చలపతిరావు సూచించారు. సోమవారం వేపాడ పశు వైద్య కేంద్రంలో గోపాలమిత్రులు, ఎహెచ్ఎలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ విషయంలో సిబ్బందికి ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఆదివాసీల జీవన స్థితిగతుల పరిశీలన

ప్రజాశక్తి -భామిని

క్షేత్రస్థాయిలో గిరిజన జీవన స్థితిగతులను అధ్యయనం చేయడానికి మండలంలోని బొడ్డగూడ గ్రామాన్ని ఏడుగురితో కూడిన ట్రెయినీ ఐఎఎస్‌ల బృందం సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా వారికి గిరిజనులు డప్పు, వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ట్రెయినీ ఐఎఎస్‌లు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి గిరిజనులతో మమేకమై, వారి సమస్యలు, స్థానికంగా లభిస్తున్న విద్య, వైద్య, సౌకర్యాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పండగలు, జీవనంలో వస్తున్న మార్పులు, పంటలపై ఆరాతీశారు. అనంతరం గ్రామంలోని శ్మశాన వాటికను, పండిస్తున్న పంటలు, గిరిజన గ్రామదేవత స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పూర్తి స్థాయిలో పాఠశాల నిర్మాణం లేదని, గర్భిణులను దృష్టిలో ఉంచి స్థానికంగా వైద్య సదుపాయం కల్పించాలని గిరిజనులు కోరారు. తాగునీటి సదుపాయాలు కల్పించాలని, గిరిజనులు నివాసం ఉంటున్న కొండ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అవకాశం కల్పించాలని విజ్ఞప్తిచేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో ట్రెయినీ ఐఎఎస్‌లు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఎఎంఒ కోటి బాబు, డిడి శ్రీనివాసరావు, సర్పంచ్ అనంత్, తహశీల్దార్ అప్పారావు, ఎంపిడిఒ జి.చంద్రరావు, సెక్రటరీ చంద్రశేఖర్, వెలుగు భవాని పాల్గొన్నారు.

సీతంపేట.. పూతికవలసలో పంటలను పరిశీలిస్తున్న ట్రెయినీ ఐఎఎస్‌ల బృందం

విద్యార్థినులతో మాట్లాడుతున్న ట్రెయినీ ఐఎఎస్

సీతంపేట : మండలంలో మారుమూలైన గిరిజన ప్రాంతమైన పూతికవలస గిరిజన ప్రాంతాన్ని ట్రెయినీ ఐఎఎస్‌ల బృందం సందర్శించింది. గ్రామస్తులతో మమేకమై వారి స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం పూతికవలస ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. అక్కడ విద్యా ప్రమాణాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయం సిబ్బందితో మాట్లాడి, సంక్షేమ పథకాల గురించి తెలుసుకున్నారు. అక్కడ పంట పొలాలను పరిశీలించారు. ఈ బృందం వెంట ఎటిడబ్ల్యుఒ జి.మంగవేణి, ఎంఒ పి.కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం సీజ్

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మండలంలో బాగువలసలో సుతాపల్లి నగేష్‌కు చెందిన అనధికార ఎరువుల దుకాణాన్ని విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. చాలా రోజుల నుండి అనధికారికంగా సుతాపల్లి నగేష్ అనే వ్యక్తి ఎరువులు , పురుగు మందులను బయట నుండి తీసుకువచ్చి బాగువలస పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న విజిలెన్స్ సిఐ సింహాచలం తన సిబ్బందితో కలిసి శుక్రవారం బాగువలసలో నగేష్ షాప్‌నకు వచ్చారు. అప్పటికే విజిలెన్స్ అధికారులు వచ్చినట్లు తెలుసుకున్న నగేష్ షాప్ మూసేసి తప్పించుకున్నాడు. విజిలెన్స్ అధికారులు నగేష్ భార్యను పిలిపించి ఎరువులున్న షాప్‌నకు తాళాలు వేశారు. సోమవారం మళ్లీ వచ్చి తనిఖీలు చేస్తామని చెప్పారు. వారు అనుకున్నట్లే సోమవారం మండల వ్యవసాయ అధికారులతో కలిసి బాగువలస చేరుకొని షాపును తెరిచారు. ఆ షాప్‌లో సుమారు 77 యూరియా, 10 డిఎపి, 17 ఎంఒపి, 3 భూ అషుద్, 20 మెగా పవర్, 2 స్వర్ణ సూపర్ బస్తాలున్నాయి. వాటి విలువ రూ.1.71 లక్షలుగా నిర్ధారించారు. అనధికారికంగా అమ్మకాలు సాగిస్తున్న సుతాపల్లి నగేష్‌పై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇంఛార్జి వ్యవసాయ అధికారి మధుసూదనరావు, ఎఇఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

గ్రీన్‌అంబాసిడర్ల రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎపి గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం ఎదుట గ్రీన్ అంబాసిడర్లు సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ మండలంలో 32 పంచాయతీల్లో 72 మంది స్వచ్ఛభారత్ క్లాప్‌మిత్ర కార్మికులు ఉన్నారని, 6 నెలల నుండి రెండేళ్ల వరకు వేతనాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అతి తక్కువ వేతనజీవులైన పంచాయతీ కార్మికుల జీతాలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటే ఎలా జీవించాలని ప్రశ్నించారు. పంచాయతీ కార్మికులకు ఎన్నికల ముందు సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం, రెగ్యులరైజేషన్ అమలు చేయాలన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపిడిఒ దీక్షా శిబిరం వద్దకు చేరుకుని, గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో దీక్షలను విరమించారు. గ్రీన్ అంబాసిడర్ల సంఘం మండల గౌరవ అధ్యక్షులు కాద రాము అధ్యక్షతన చేపట్టిన కార్యక్రమంలో ఎన్.గురువులు, బి.రవి, సిహెచ్.శంకర్రావు, జి.దుర్గారావు, ఎ.కూర్మారావు, బి.ఆనంద రావు, ఎస్.సూర్యనారాయణ, కె.రాము, కె.శ్రీను, బి.వెంకయ్య, ఆర్.సత్యం, బి.దాసు, ఆర్.పకీరు, ఆర్.రాజారావు, జి.గౌరమ్మ, ఎం.పార్వతమ్మ, ఎం.అప్పారావు, డి.కూర్మయ్య, ఎ.బాబూరావు, సిహెచ్ సోములు, ఎ.రామారావు తదితరులు పాల్గొన్నారు.

దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు

సాగు భూములకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని వెంకటబైరిపురం గ్రామ రెవెన్యూలో 24 గిరిజన కుటుంబాలు సాగు చేస్తున్న కొండ పోరంబోకు భూమికి పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు ఆధ్వర్యాన ఆ భూముల వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ గిరిజనులు మూడేళ్లుగా సాగుచేస్తున్నారని తెలిపారు. దీనిపై తహశీల్దార్‌కు వినతి అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పిట్టల సీతారాం, నాయకులు చంటి, గిరిజనులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న గిరిజనులు, వ్యకాస నాయకులు

దీక్షలకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు బంగారయ్య

జ్యూట్ కార్మికుల దీక్షలకు కాంగ్రెస్ మద్దతు

ప్రజాశక్తి-సాలూరు

కొద్దిరోజులుగా జీగిరాం జ్యూట్ కార్మికులు చేపడుతున్న రిలే దీక్షలకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సిగడాపు బంగారయ్య మద్దతు తెలిపారు. సోమవారం జీగిరాం జ్యూట్‌మిల్లు వద్ద నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి, సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న ఏకైక పరిశ్రమ జ్యూట్ మిల్లు మూతపడటంతో రెండు వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం మిల్లు తెరిపించే ప్రయత్నం చేయాలని, కార్మికులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను వినియోగించుకోవాలి

డిఐఒ జగన్మోహనరావు

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహనరావు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అందజేస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిఐఒ టి.జగన్మోహనరావు కోరారు. మండలంలోని దత్తివలస గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా 104 వాహనంలో ఉన్న వైద్య పరికరాలు, రోగ నిర్ధారణ పరీక్షల కిట్లు, మందులను ఆయన పరిశీలించారు. ప్రజలకు ఇవి ఏ విధంగా ఉపయోగపడుతున్నాయి, వీటి ఆవశ్యకతను అక్కడున్న వారికి వివరించారు. గర్భిణులకు 104 వాహనంలో వైద్య సిబ్బంది నిర్వహించిన ఇసిజి రిపోర్టును ఆయన పరిశీలించారు. ప్రజలు చెప్పే అనారోగ్య సమస్యలను పూర్తిగా విని ఆయా సందర్భాల్లో వైద్య పరికరాలను ఆరోగ్య తనిఖీలకు వినియోగించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఒపి రికార్డులో నమోదు చేసిన రోగుల అనారోగ్య సమస్యలు, నిర్వహించిన పరీక్షలు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. వివరాలన్నీ ఎఫ్‌డిపి యాప్‌లో నమోదు చేయాలన్నారు. సీజనల్ జ్వరాలు గుర్తిస్తే వెంటనే నిర్ధారణ పరీక్షలు చేసి, తగు చికిత్సలు అందజేయాల్సి ఉందన్నారు. జ్వరాలు తగ్గే వరకు క్షేత్ర స్థాయి సిబ్బంది పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కర్రి అరుణకుమారి, సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది జి.సురేష్ కుమార్, సోములమ్మ, దుర్గాభవాని, 104 సిబ్బంది శివగణేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఓటరు సర్వే పరిశీలన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

వెంకంపేటలో ఓటర్ల సర్వే ప్రక్రియను ఆర్‌డిఒ కె.హేమలత సోమవారం సాయంత్రం పరిశీలించారు. వెంకంపేటలో పోలింగ్ కేంద్రాలు 61, 62 పరిధిలో తొలగింపు అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఓటర్ల తొలగింపు ప్రక్రియను ప్రజలకు వివరించారు. తప్పులు ఉంటే వెంటనే తెలియజేయాలని ప్రజలను కోరారు. యువత ఓటర్లుగా చేరాలని కోరారు. కార్యక్రమంలో బిఎల్‌ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

స్పందన వినతులకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిచ్చి వెంటనే వారికి న్యాయం చేయాలని ఎస్‌పి విక్రాంత్ పాటిల్.. పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా చూడాలని ఆదేశించారు. తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి (అడ్మిన్) ఒ.దిలీప్ కిరణ్, సిఐలు సిహెచ్.లక్ష్మణ రావు, ఎన్.వి. ప్రభాకర్ రావు, ఎస్ఐ పాపారావు సిబ్బంది పాల్గొన్నారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి విక్రాంత్

బీమా సహాయం అందజేత

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో బియ్యాలవలస పంచాయతీ దురుబిలి గ్రామానికి చెందిన తోయక సుక్కయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. సోమవారం వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కె. రామచంద్ర.. ఆయన కుటుంబ సభ్యులకు వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం రూ.10 వేలు అందించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పువ్వుల పత్తి, సచివాలయ కన్వీనర్ వికాస్ పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులుగా దేవానంద్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులుగా పాలక దేవానంద్ ఎంపికయ్యారు. నూతన కమిటీని ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు సామల సింహాచలం సోమవారం ప్రకటించారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా కె.త్రినాథరావు, ప్రధానకార్యదర్శిగా వి.నారాయణరావు, ఉపాధ్యక్షులుగా చవితి గోపాల్, పి.నిర్మల్ కుమార్, కె.మోష, పి.అనంతరావు, అలజంగి చిన్నారావు, చిన్ని కృష్ణ, కార్యదర్శులుగా తోట గోపి, పి.గోవిందరావు, పెద్దింటి చిన్నారావు, ఎస్.ఎర్రయ్య, వై.సతీష్ ఎంపికయ్యారు.


దేవానంద్

కృష్ణమూర్తి అందరికీ ఆదర్శం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం పట్టణ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్, వృద్ధ మిత్ర కోఆర్డినేటర్ కృష్ణమూర్తి అందరికీ ఆదర్శమని విజయనగరం జిల్లా పోలీస్ శాఖ అధికారులు అన్నారు. విజయనగరంలో ఉన్న కాకతీయ కళ్యాణ మండపంలో కృష్ణమూర్తి పోలీస్ శాఖలో చేరి 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన సేవలను గుర్తించి సిఐలు కె.పైడిపునాయుడు, బి.చలపతిరావు సత్కరించారు. మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.సూర్యారావు, ఎస్ఐ పోలినాయుడు, ఎఎస్ఐ తిరుపతిరావు పాల్గొన్నారు.

హెచ్‌సి కృష్ణమూర్తిని సత్కరిస్తున్న పోలీసు అధికారులు

మహిళా సాధికారతకు కృషి

ప్రజాశక్తి-సాలూరు

రాష్ట్రంలో మహిళా సాధికారత కోసం టిడిపి కృషి చేస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి అన్నారు. సోమవారం పట్టణంలోని 16, 17వ వార్డుల్లో మహిళా శక్తి కార్యక్రమంలో ఆమె మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్ దేవ్‌తో కలిసి పాల్గొన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో మహిళా సాధికారత కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. మళ్లీ అధికారంలోకి వస్తే మహిళా సంక్షేమానికి పెద్దపీట వేయనున్నట్లు తెలిపారు. వైసిపి హయాంలో మహిళలపై అఘాయిత్యాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో రక్షణ లేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, సీనియర్ నాయకులు గొర్లి మధుసూదనరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలోని సర్వపాడు గ్రామానికి వెళ్లే రహదారిలో కొత్తవలస గ్రామ సమీపంలో సోమవారం రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో గుమ్మడ గ్రామానికి చెందిన బొట్ట తిరుపతిరావుకు, విశాఖపట్నం జిల్లాకు చెందిన గంటపల్ల అప్పలరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇచ్చి జిల్లా ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో రామగిరి క్షేత్రం వద్ద ఉన్న భారతీయ ఇంటర్నేషనల్ స్కూల్లో తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రిన్సిపల్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు 5, 6, 7, 8వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష పట్టుపై ఈ పోటీలు ఉంటాయని తెలిపారు. తెలుగు ప్రాముఖ్యత గురించి వివరించారు

440 లీటర్ల స్వాధీనం

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

మండలం ఎంఆర్ నగరం గ్రామ శివారులో సోమవారం రూరల్ ఎస్ఐ సింహాచలం ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అక్రమంగా రవాణా చేస్తున్న 440 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా సరిహద్దు గ్రామం అలమండ సమీపంలోని బొరిగి గ్రామానికి చెందిన కొండగొర్రె అజిత్‌ను అరెస్టు చేశారు. ఆటోను సీజ్ చేశారు.